E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :281 శనివారం 19 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## "దుకాణం ధర ఒకటి.. బెల్ట్ షాపులో బాదుడు మరొకటి

# చివరికి గుడుంబానే గతి!"

**కన్నాయిగూడెం ఏజెన్సీలో మద్యం ధరల దందాపై తక్షణ చర్యలు తీసుకోవాలి**

**అధిక ధరలతో గుడుంబా వైపు మళ్లుతున్న మద్యం వినియోగదారులు**

**-- తుడుం దెబ్బ కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఆలం రాంబాబు డిమాండ్**






**తెలుగు గళం కన్నాయిగూడెం, సెప్టెంబర్ 18:**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల ఏజెన్సీ ప్రాంతంలో మద్యం విక్రయాలపై వస్తున్న అధిక ధరల వసూళ్ల ఆరోపణలు, బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలకు విక్రయాలు, అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ కన్నాయిగూడెం మండల అధ్యక్షులు ఆలం రాంబాబు డిమాండ్ చేశారు. వైన్స్ షాపుల్లో మద్యం సీసాలపై ఉన్న ఎంఆర్పీ కంటే సుమారు రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, బెల్ట్ షాపులకు మద్యం తరలించి అక్కడ రూ.20 నుంచి రూ.50 వరకు అదనపు ధరలకు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. రోజంతా కష్టపడి పనిచేసే కార్మికులు, పేదలు సాయంత్రం మద్యం కోసం వెళ్లినప్పుడు అధిక ధరలు చెల్లించాల్సి వస్తుండటంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రభావం పడుతోందన్నారు.



**అధిక ధరలతో గుడుంబా వైపు మళ్లే ప్రమాదం**

వైన్స్ షాపుల్లోనే అధిక ధరలు చెల్లించాల్సి రావడంతో కొంతమంది మద్యం వినియోగదారులు "తక్కువ రేటు.. ఎక్కువ మైలేజ్"అనే భావనతో నాటుసారా, గుడుంబా వైపు మళ్లుతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆలం రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. గుడుంబా తక్కువ ధరకు లభిస్తుందనే కారణంతో దాని వైపు ఆకర్షితులైతే ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలగడంతో పాటు కుటుంబాల్లో ఆర్థిక, సామాజిక సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా యువత ఈ వ్యసనానికి గురికాకుండా గుడుంబా తయారీ, విక్రయాలపై కూడా ఎక్సైజ్ అధికారులు కఠిన నిఘా పెట్టాలని కోరారు.

**అధికారులు వెంటనే రంగంలోకి దిగాలి**

కన్నాయిగూడెం మండలంలోని వైన్స్ షాపులు, బెల్ట్ షాపులు, అనధికారిక మద్యం విక్రయ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు, ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఆలం రాంబాబు డిమాండ్ చేశారు. ఎంఆర్పీ కంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నట్లు తేలితే సంబంధిత దుకాణాలపై చట్టపరమైన, శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా, అనధికారిక విక్రయాలు, గుడుంబా తయారీ--విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే పర్యవేక్షణ వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని, అందువల్ల జిల్లా ఎక్సైజ్ ఉన్నతాధికారులు స్వయంగా జోక్యం చేసుకుని కన్నాయిగూడెం ఏజెన్సీలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆలం రాంబాబు కోరారు. ఎంఆర్పీ ఉల్లంఘనలకు అడ్డుకట్ట, బెల్ట్ షాపుల నియంత్రణ, గుడుంబా నిర్మూలన, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టి ఏజెన్సీ ప్రజలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# సీమ పౌరుషం చూపిస్తా!

- కొత్త పార్టీతో సీమ రాజకీయాల్లో వేడి
- సీమ పౌరుషం చూపిస్తామన్న విజయసాయి
- రెడ్ల ఆత్మగౌరవమే పార్టీ లక్ష్యం
- రెడ్డి కార్పొరేషన్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నేత
- సీమ అభివృద్ధిపై టీడీపీ, వైసీపీ విమర్శలు
- రాయలసీమ నుంచి వలసలపై ఆవేదన
- యువత అభివృద్ధి కోసం పనిచేయాలి
- సీమను 'రతనాల సీమ'గా మారుస్తాం



2 లో

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్రంలో త్వరలో స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీ రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా నిలుస్తుందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ పార్టీ రాయలసీమ ఒరిజినల్ రెడ్ల పౌరుషాన్ని కాపాడే పార్టీగా పనిచేస్తుందని, అసలైన సీమ పౌరుషం ఎలా ఉంటుందో రాబోయే రోజుల్లో చూపిస్తామని స్పష్టం చేశారు.

**రెడ్డి కార్పొరేషన్ ఏదీ?**

రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులకు పూర్తి న్యాయం చేస్తూనే రెడ్ల ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యతను తమ పార్టీ తీసుకుంటుందని తెలిపారు.

# 'కల్పిత నాయకుడు' పుస్తకానికి చెక్!


2 లో

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** డాక్టర్ బీఆర్ అంబేదర్‌పై అనుచిత వ్యాఖ్యలతో 'కల్పిత నాయకుడు' (ఫ్యాబ్రికేటెడ్ లీడర్) పుస్తక రచయిత వరప్రసాద్ అలియాస్ హమారాప్రసాద్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినందున పుస్తకావిష్కరణ జరిగే ప్రసక్తే లేదని ప్రభుత్వం గురువారం హైకోర్టుకు నివేదించింది.

# ఢిల్లీ గ్యాంగ్‌రేప్ కలకలం!

- టెంపోలోనే సామూహిక అత్యాచారం
- కత్తితో పొడిచి హత్య
- పొలంలో మృతదేహం పడేసిన నిందితులు
- 50కి పైగా సీసీటీవీల పరిశీలన
- ఐదు రోజులు టెంపో కదలికల ట్రాకింగ్
- ముగ్గురు మైనర్లతో నలుగురు అరెస్ట్
- కత్తులు, దుస్తులు, టెంపో స్వాధీనం


2 లో

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున నిర్భయ తరహా దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పదహారేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తితో పొడిచి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని బహిరంగ ప్రదేశంలో పడేసిన ఘటన కలకలం రేపుతోంది. ఈ దారుణానికి సంబంధించిన కుళ్లిపోయిన మృతదేహం సెప్టెంబర్ 13న లభించగా.. పోలీసులు దర్యాప్తు చేసి నలుగురు నిందితులను నేడు అదుపులోకి తీసుకున్నారు.

**టెంపోలో గ్యాంగ్‌రేప్.. సైలెంట్‌గా మర్డర్**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బాలికకు, నిందితులకు ముందుగానే పరిచయం ఉంది. ఘటన జరిగిన రోజు ఆమె వారితో కలిసి టెంపోలో ప్రయాణించింది.

# డీజే అనుమతులపై లోకేష్ ఫోకస్!


2 లో

- అనుమతులపై పోలీసులకు కీలక విజ్ఞప్తి
- హోంమంత్రి, డీజీపీకి లోకేష్ ట్యాగ్
- అనుమతుల ప్రక్రియ సులభతరం చేయాలి
- వేగంగా క్లియరెన్స్‌లు ఇవ్వాలని సూచన
- డీజే వాహనాలు సీజ్ చేయొద్దని విజ్ఞప్తి
- నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- పోలీసులకు అనిత కీలక ఆదేశాలు

# నిషేధిత భూములకు సర్కార్ చెక్!



2 లో

- 22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి హైలెవల్ కమిటీ
- ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌కు కీలక బాధ్యత
- సభ్యులుగా లా సెక్రటరీ, స్టాంప్స్ ఐజీ నియామకం
- నిషేధిత జాబితాపై ప్రజల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కార మార్గాలపై కసరత్తు
- భూ యజమానుల సమస్యలకు త్వరిత పరిష్కారంపై ఫోకస్


## రూ.14 వేల లంచం తీసుకుంటూ

# ఏసీబీకి చిక్కిన గోవిందరావుపేట తహసీల్దార్!

**భూమి పౌతి మార్పిడి కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు**

**ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ.. ముందస్తు ప్రణాళికతో పట్టివేత**

**తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ సోదాలు**



2 లో

**తెలుగు గళం, ములుగు, సెప్టెంబర్ 18:**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండల తహసీల్దార్ సృజన్‌కుమార్ రూ.14 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడినట్లు సమాచారం. భూమి పౌతి మార్పిడి ప్రక్రియకు సంబంధించి లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుదారుడి నుంచి నగదు స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు తహసీల్దార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం గోవిందరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు, తనిఖీలు నిర్వహిస్తున్నారు. లంచం వ్యవహారానికి సంబంధించిన పత్రాలు, రికార్డులు, ఇతర ఆధారాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు!

- దానం నాగేందర్‌పై హైకోర్టు కీలక తీర్పు
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- 2024 ఏప్రిల్ నుంచే అనర్హత వర్తిస్తుందని స్పష్టం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి దానం
- లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీ-ఫారమ్‌పై పోటీ
- అనర్హత కోరుతూ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- స్పీకర్ ఉత్తర్వులను సవాల్ చేసిన పిటిషనర్లు

2 లో

# 1000 కోట్లు ఇస్తే మా ఆస్తులన్నీ ఇచ్చేస్తా

- ఫార్ములా ఈ కేసుపై కేటీఆర్ ఫైర్
- రూ.1000 కోట్లకు ఆస్తుల ఆఫర్
- లక్ష కోట్ల ఆరోపణలపై కౌంటర్
- తప్పుడు కేసులు పెడుతున్నారన్న కేటీఆర్
- న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం
- ఎప్పుడైనా విచారణకు సిద్ధమని స్పష్టం
- బ్రాండ్ ఇమేజ్ కోసమే రేస్ నిర్వహణ
- కాంగ్రెస్ తీరుపై కేటీఆర్ విమర్శలు


2 లో

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు ఫార్ములా ఈ రేస్ నిర్వహించామని, అందులో అవినీతి జరిగిందని తప్పుడు కేసులు పెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఫార్ములా ఈ కారు రేసు విచారణలో భాగంగా నాంపల్లి ఏసీబీ కోర్టుకు హాజరైన కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసులకు భయపడము.. న్యాయవ్యవస్థలపై తమకు అపారమైన నమ్మకం ఉందన్నారు. పోలీసులు ఎంత వేధించిన ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయవ్యవస్థ తమకు వెన్నుదన్నుగా ఉందని ధీమా వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ ఎన్ఐఏ కోర్టు సంచలనం!

- మానవ అక్రమ రవాణా కేసులో ఎన్ఐఏ కోర్టు తీర్పు
- 9 మంది నిందితులకు జీవిత ఖైదు విధించిన న్యాయస్థానం
- శిక్ష పడిన వారిలో 8 మంది బంగ్లాదేశ్ పౌరులు
- ఉద్యోగాల ఆశ చూపి మహిళలను అక్రమంగా తరలింపు
- బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లు ఎన్ఐఏ దర్యాప్తు
- 12 మంది నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసిన ఎన్ఐఏ
- సాక్ష్యాధారాల పరిశీలన తర్వాత నేరం రుజువు

2 లో

# జీవో 118పై ప్రభుత్వం కీలక నిర్ణయం!

- జీవో 118 బాధితులకు ప్రభుత్వం భారీ ఊరట
- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు
- ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి క్రమబద్ధీకరణ
- 1000 చదరపు గజాల లోపు స్థలాలకు అవకాశం
- చదరపు గజానికి రూ.250 రుసుముతో క్రమబద్ధీకరణ
- ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ప్రక్రియకు కదలిక
- లబ్ధిదారులకు త్వరలో హక్కు పత్రాల జారీ

2 లో

# సీమ పౌరుషం చూపిస్తా!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఇన్ని ఏండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర విభజన తర్వాత ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఇద్దరూ రాయలసీమ ప్రాంతానికి చెందిన నేతలే అయినప్పటికీ, సీమను ఏమాత్రం అభివృద్ధి చేయలేకపోయారని ధ్వజమెత్తారు. నారా చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబాలు రాష్ట్రాన్ని దశాబ్దాలుగా పాలిస్తున్నప్పటికీ రాయలసీమకు జరిగింది శూన్యమని మండిపడ్డారు. ఈ రెండు కుటుంబాలు కలిసి సీమలోని ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయాయని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఈ కుటుంబాలకు రాజకీయాలు గుర్తుకొస్తాయని, సీమలో పుట్టిన ఈ నాయకులు ఇతర ప్రాంతాల్లో స్థిరపడి ఈ ప్రాంతాన్ని విస్మరించారని ఆరోపించారు.

రాయలసీమను 'రతనాల సీమ' చేస్తాం..

రాష్ట్రంలో అత్యధికంగా ప్రజలు వలస వెళ్తున్నది రాయలసీమ నుంచే కావడం చాలా బాధాకరమైన విషయమని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ యువత ఇకనైనా వ్యక్తుల కోసం కాకుండా ఈ గడ్డ అభివృద్ధి కోసం, రాష్ట్ర దేశాభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, వైసీపీ పార్టీల వల్ల రాయలసీమ ఎప్పటికీ బాగుపడదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువతను భాగస్వామ్యం చేస్తూ రాయలసీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ పార్టీ అన్ని కులాలను, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు!



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్‌కు తెలంగాణ హైకోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఆయనపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం.. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ సంచలన తీర్పు వెలువరించింది. దానం నాగేందర్ విషయంలో అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మసనం, స్పీకర్ ఉత్తర్వులపై స్టే విధించింది. ఈ తీర్పుతో 2024 ఏప్రిల్ నుంచే ఆయన శాసనసభ్యుడిగా అనర్హతకు గురైనట్లు కోర్టు స్పష్టం చేసింది.


బీఆర్ఎస్ నుంచి గెలుపు..

2023 నవంబర్‌లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. అయితే, బీఆర్ఎస్‌కు అధికారికంగా రాజీనామా చేయకుండానే 2024 లోక్ సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ బీ-ఫారమ్ పోటీ చేయడం వివాదాస్పదమైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే మరొక పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శలు వచ్చాయి.

స్పీకర్‌కు ఫిర్యాదు..

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే, విచారణ చేపట్టిన స్పీకర్.. దానం నాగేందర్ చట్టబద్ధంగా పార్టీ మారినట్లు ఆధారాలు లేవంటూ ఆ పిటిషన్లను కొట్టివేశారు. స్పీకర్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషనర్లు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం స్పీకర్ నిర్ణయం చెల్లదని తేల్చిచెప్పిన హైకోర్టు, దానం నాగేందర్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేసింది.

# జీవో 118పై ప్రభుత్వం కీలక నిర్ణయం!



GOVERNMENT OF TELANGANA
REVENUE (LAND ADMINISTRATION. I) DEPARTMENT

Memo. No. 46940/Land Admin. I(1)/2026-3 Dated: [illegible]-09-2026

Sub: Lands - G. O. Ms. No. 118 (L. B. Nagar Constituency) – Short discussion on "Issues related to Section 22 – A of Registration Act" in the Telangana Legislative Assembly on 16-09-2026 – Instructions – Issued.

Ref's: 1) G. O. Ms. No. 118, Revenue (Assignment. I) Department, Dated 28-10-2022.
2) G. O. Ms. No. 47, Revenue (Land Administration. I) Department, Dated 12-05-2023.

<<>> <<<>>> <<>>

The attention of the Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad and District Collector Ranga Reddy and Medchal Malkajgiri is invited to the references cited and they are requested to dispose all 9792 applications received under G. O. Ms. No. 118, Revenue (Assignment. I) Department, Dated 28-10-2022 read with G. O. Ms. No. 47, Revenue (Land Administration. I) Department, Dated 12-05-2023 within a period of One Month subject to Hon'ble Court Orders, if any.

LOKESH KUMAR D.S.
SECRETARY TO GOVERNMENT

To

The Chief Commissioner of Land Administration, Telangana, Hyderabad.
The District Collector Ranga Reddy and Medchal Malkajgiri.
SC

//forwarded by order //

Asst. Secretary to Govt.,

**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ ప్రభుత్వం ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీవో 118 భూముల సమస్యకు పరిష్కారం చూపింది. గత 15, 20 ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించింది. క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను త్వరలోనే పరిష్కరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను కూడా విడుదల చేసింది.

జీవో 118 నేపథ్యం ఇదే..

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కార్వాన్, నాంపల్లి, జూబ్లీహిల్స్, మేడ్చల్ తదితర నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకుని దీర్ఘకాలంగా ఉంటున్న పేద, మధ్యతరగతి ప్రజల స్థలాలను క్రమబద్ధీకరించే ఉద్దేశంతో గతంలో ఈ జీవో 118ని తీసుకువచ్చారు. ఈ విధానం కింద 1000 చదరపు గజాల లోపు ఉన్న స్థలాలను నిర్ణీత రుసుముతో క్రమబద్ధీకరించే అవకాశం కల్పించారు. చదరపు గజానికి రూ.250 చొప్పున రుసుము చెల్లించేలా నిబంధన రూపొందించారు. అయితే, ఎన్నికల కోడ్, ఇతర టెక్నికల్ కారణాల వల్ల కొంతమంది లబ్ధిదారులకు సకాలంలో హక్కు పత్రాలు ఇంకా అందలేదు. ఫలితంగా జీవో 118 అమలులో జాప్యం జరిగి సమస్య కొనసాగింది. ఈ నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, లబ్ధిదారులకు హక్కు పత్రాలు జారీ చేసే ప్రక్రియపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

# నిషేధిత భూములకు సర్కార్ చెక్!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణలో సెక్షన్ 22-ఏ నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన చేయగా, ఇందుకు సంబంధించి ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. భూముల జాబితాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, విజ్ఞప్తులను పరిశీలించి సత్వర పరిష్కారం చూపడానికి ప్రభుత్వం ఓ హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం ముగ్గురు అధికారులతో కూడిన ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్..

ఈ ఉన్నత స్థాయి కమిటీకి చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ ను ప్రభుత్వం నియమించింది. సభ్యులుగా లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వ్యవహరించనున్నారు. ఈ కమిటీ నిషేధిత భూముల జాబితాలోని అంశాలపై సమగ్రంగా చర్చించి, క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు తగిన కార్యాచరణను రూపొందించనుంది. సెక్షన్ 22-ఏ నిషేధిత భూముల జాబితా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఏర్పాటు ద్వారా భూ యజమానుల సంవత్సరాల తరబడి ఉన్న సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# ఢిల్లీ గ్యాంగ్‌రేప్ కలకలం!

మొదటి పేజీ తరువాయి

ప్రయాణ సమయంలో వారు టెంపోలోనే కలిసి మద్యం సేవించారు. ఆ తర్వాత బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఎవరికీ తెలియకుండా నార్త్‌వెస్ట్ ఢిల్లీలోని స్వరూప్ నగర్ ప్రాంతంలో, కుషాక్ రోడ్డు సమీపంలోని జైపాల్ రాణా అనే వ్యక్తి పొలంలో పడేశారు. సెప్టెంబర్ 13న ఈ కుళ్లిన మృతదేహం స్థానికులకు కంటపడింది. అయితే, మృతదేహం కనీసం లింగ నిర్ధారణ చేయడానికి కూడా వీలుకాని స్థితిలో ఉంది. కొన్ని భాగాలను వీధి కుక్కలు తినేయగా, ఒక చేయి వేరుపడి కనిపించింది. బాలిక తరచూ ఇంటి నుంచి వెళ్లి కొద్ది రోజుల తర్వాత తిరిగి వస్తుండటంతో, కుటుంబ సభ్యులు ఆమె కనిపించట్లేదని ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.

50కి పైగా సీసీటీవీ ఫుటేజ్‌ల పరిశీలన..

ఈ ఘటనపై పోలీసులు బీఎన్ఎస్, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేశారు. ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేకపోవడం, నిందితుల గుర్తింపు మొదట స్పష్టంగా తెలియకపోవడంతో పోలీసులు ప్రత్యేక బలగాలతో దర్యాప్తు చేపట్టారు. మృతదేహం దొరికిన ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మార్గాల్లో 50కి పైగా సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ సమయంలోనే హత్య స్థలానికి సమీపంలో ఓ టెంపో కదులుతున్నట్లు గుర్తించారు. అయితే, చీకటి కారణంగా దాని రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టంగా కనిపించలేదు. దీంతో దర్యాప్తు అధికారులు మరికొన్ని సీసీటీవీ లొకేషన్ల ఆధారంగా ఆ టెంపో కదలికలను దాదాపు 5 రోజుల పాటు నిమిషం నిమిషానికి ట్రాక్ చేశారు.

నిందితుల్లో ముగ్గురు మైనర్లు.. ఆయుధాల స్వాధీనం

ఈ నెల 15, 16 తేదీల రాత్రి సమయంలో సుదీర్ఘ సెర్చ్ ఆపరేషన్ తర్వాత అనుమానిత టెంపోను గుర్తించి డ్రైవర్‌ను విచారించారు. దీంతో ఈ హత్యతో సంబంధం ఉన్న ముగ్గురు మైనర్లతో సహా మొత్తం నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడిని ఖద్దా కాలనీకి చెందిన శివమ్ అలియాస్ సుదామ అలియాస్ చుచుగా గుర్తించారు. మిగిలిన ముగ్గురు మైనర్ల వయస్సు 16, 17 ఏళ్లుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేరానికి ఉపయోగించిన రెండు కత్తులు, నిందితులు ధరించిన దుస్తులు, టెంపోను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ఫోరెన్సిక్, టెక్నికల్ సాక్ష్యాధారాలను పరిశీలించేందుకు పోలీసుల తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# హైదరాబాద్ ఎన్ఐఏ కోర్టు సంచలనం!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** మానవ అక్రమ రవాణా కేసులో హైదరాబాద్‌లోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. 2019లో వెలుగులోకి వచ్చిన ఈ కేసులో విచారణ ముగిసి సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం నేరం రుజువుకావడంతో ఏకంగా 9 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తుది తీర్పును ప్రకటించింది. శిక్ష పడిన 9 మందిలో 8 మంది బంగ్లాదేశ్ పౌరులు ఉండటం గమనార్హం.

ఉద్యోగాల ఆశ చూపి.. వ్యభిచారంలోకి కూపంలోకి..

బంగ్లాదేశ్ నుంచి మహిళలను అక్రమంగా భారత్‌కు తరలించిన ఉదంతం 2019లో తీవ్ర కలకలం రేపింది. నగర పరిధిలోని పహాడీ షరీఫ్ పరిధిలో నమోదైన ఈ కేసుకు సంబంధించి హ్యూమన్ ట్రాఫికింగ్ నెట్‌వర్క్ ను అధికారులు బట్టబయలు చేశారు. బాధితురాళ్లకు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించిన నిందితులు, వారిని అక్రమంగా తరలించి బలవంతంగా వ్యభిచారంలోకి దింపినట్లుగా ఎన్ఐఏ దర్యాప్తులో స్పష్టమైంది. ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ముఠా గుట్టును దర్యాప్తు సంస్థ రట్టు చేసింది. ఈ వ్యవహారంపై 2019లో పోలీసులు తొలిసారిగా కేసు నమోదు చేశారు. ఆ తర్వాత కేసు తీవ్రతను పరిగణలోకి తీసుకున్న జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు ఈ కేసును రీ-రిజిస్టర్ చేసి తమ చేతుల్లోకి తీసుకున్నారు. లోతుగా దర్యాప్తు జరిపిన ఎన్ఐఏ అధికారులు ఈ కేసులో ఏ1 నుంచి ఏ12 వరకు మొత్తం 12 మంది నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.

సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం తీర్పు..

ఈ కేసులో న్యాయస్థానంలో పూర్తి వాదనలు పూర్తిగా ముగిశాయి. సాక్ష్యాధారాల సమగ్ర పరిశీలన అనంతరం నిందితులపై నేరం రుజువైంది. దీంతో హైదరాబాద్ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఈ కేసులో తుది తీర్పును వెల్లడించింది. మొత్తం నిందితుల్లో 9 మందికి జీవిత ఖైదును ఖరారు చేస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పును వెలువరించారు.

# 1000 కోట్లు ఇస్తే మా ఆస్తులన్నీ ఇచ్చేస్తా

మొదటి పేజీ తరువాయి

ఫార్ములా ఈ రేస్ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా రావడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. తమిళనాడు సీఎం విజయ్ ఫార్ములా ఈ రేస్ కోసం లండన్ వెళ్లారని.. పక్క రాష్ట్రాలు బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవడం కోసం లండన్ వెళ్తుంటే ఇక్కడ తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. టార్గెట్ కేసీఆర్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు.. లక్ష కోట్లు సంపాదించామని కాంగ్రెస్ ప్రభుత్వం తమపై అసత్య ఆరోపణలు చేస్తుందన్నారు. "లక్ష కోట్లు కొల్లగొట్టామని రేవంత్ రెడ్డి అంటున్నారు.. రేవంత్‌కు మంచి ఆఫర్ ఇస్తున్నా.. రూ. 1000 కోట్లు ఇచ్చి మా పేరుపై ఉన్న లక్ష కోట్లు ఆస్తులు తీసుకోండి. మిగిలిన 99 వేల కోట్లు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలకోసం ఖర్చు చెయ్యండి.. కాళేశ్వరంలో లక్ష కోట్లని ప్రచారం చేసినట్లుగానే ఇప్పుడు విషప్రచారం చేస్తున్నారు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# డీజే అనుమతులపై లోకేష్ ఫోకస్!



**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** వినాయక చవితి రోజు ప్రతిష్టించిన బొజ్జ గణపయ్య విగ్రహాలను సంబరాలతో సాగనంపుతున్నారు భక్తులు.. అయితే, డీజే వాహనాలకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడం.. వాహనాన్ని సీజ్ చేసిన ఘటనపై స్పందించిన మంత్రి నారా లోకేష్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. గణేష్ నిమజ్జన కార్యక్రమాల్లో డీజే వాహనాలకు అనుమతుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీకి విజ్ఞప్తి చేశారు మంత్రి నారా లోకేష్.. నిమజ్జనానికి డీజే వాహనాలకు పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదంటూ తనకు పలువురు సందేశాలు పంపుతున్నారని ఆయన తెలిపారు.

ఈ నేపథ్యంలో హోంమంత్రి అనిత, డీజీపీ జోక్యం చేసుకుని డీజే వాహనాలకు అవసరమైన అనుమతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని లోకేష్ కోరారు. నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో అనుమతుల ప్రక్రియను సులభతరం చేసి, వేగంగా క్లియరెన్స్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గణేష్ నిమజ్జనం సందర్భంగా ఒక్క డీజే వాహనాన్ని కూడా పోలీసులు సీజ్ చేయకూడదని లోకేష్ పోలీసు శాఖను కోరారు. ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకునేలా అధికారులు సహకరించాలని ఆయన తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. లోకేష్ తన ఎక్స్ పోస్టులో హోంమంత్రి అనిత, డీజీపీని ట్యాగ్ చేస్తూ ఈ విజ్ఞప్తి చేశారు. దీనిపై హోంమంత్రి అనిత స్పందిస్తూ.. డీజే అనుమతుల దరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా పరిశీలించి అనుమతులు ఇచ్చేలా పోలీసు శాఖకు అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు.

# 'కల్పిత నాయకుడు' పుస్తకానికి చెక్!

మొదటి పేజీ తరువాయి



అంబేదర్‌పై ఆరోపణలతో ప్రచురితమైన పుస్తకావిష్కరణను నిలిపివేయాలని, రచయితపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన జర్నలిస్ట్ ఏ జ్ఞానచంద్రన్‌మౌలి గురువారం దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ టీ మాధవీదేవి విచారణ చేపట్టారు.

పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పుస్తకాల విక్రయం జరిగితే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికే పుస్తకాల విక్రయం కోసం ఆన్‌లైన్ వేదికలను ఎంచుకున్నారని తెలిపారు. ప్రభు త్వ తరపు న్యాయవాది వాదనలు కూడా విన్న న్యాయమూర్తి పిటిషన్‌పై విచారణను మూసివేశారు.

# రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన గోవిందరావుపేట తహసీల్దార్!

మొదటి పేజీ తరువాయి




భూమి పౌతి మార్పిడి పనిని పూర్తి చేసేందుకు కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు డిమాండ్ చేశారన్న ఫిర్యాదు నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. సోదాలు, విచారణ పూర్తయిన అనంతరం కేసు నమోదు, స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర ఆధారాలు, తదుపరి చర్యలపై ఏసీబీ అధికారుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు అందుబాటులో ఉన్న వివరాలను ఆరోపణలుగా మాత్రమే పరిగణించాల్సి ఉంటుంది.

# ఫ్యూచర్ సిటీ.. డేటా దూకుడు!




**న్యూస్ డెస్క్, 18 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు వరుస కడుతున్నాయి. అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) శంకుస్థాపనతో మొదలై టీసీఎస్ హైపర్‌వాల్ట్, కంట్రోల్ ఎస్, ఫార్ట్యూన్ హాస్పిటాలిటీ ప్రాజెక్టులు చేరడంతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్లస్టర్లలో ఒకటిగా ఫ్యూచర్ సిటీ అవతరిస్తున్నది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్, టీసీఎస్ హైపర్వాల్ట్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు చూస్తున్న ప్రపంచ స్థాయి టెక్ సంస్థలు హైదరాబాద్ వైపు మొగ్గు చూస్తున్నాయి. అంతర్జాతీయ డేటా, ఏఐ కంపెనీలు తమ ప్రాసెసింగ్ అవసరాల కోసం హైదరాబాద్ వైపే చూస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. స్టార్టప్‌లు, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాలకు ఫ్యూచర్ సిటీ కేరాఫ్ అడ్రస్‌గా మారనుంది. తాజాగా ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) డేటా సెంటర్ కోసం ఫ్యూచర్ సిటీలో పది ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. దీంతో హైపర్‌స్కేల్ క్లౌడ్ సంస్థలతో పాటు బ్యాంకింగ్ రంగం కూడా రానుంది. ఎస్‌బీఐ డేటా సెంటర్ కోసం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్ పేట్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

రూ.60వేల కోట్లతో అమెజాన్ పెట్టుబడి

2025 డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో అమెజాన్‌తో కుదిరిన ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం ప్రకారం రూ.60 వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ అభివృద్ధికి సిద్ధపడింది. ఈ ఏడాది జూలై 15న సీఎం రేవంత్‌రెడ్డి భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం కేటాయించిన 202 ఎకరాల్లో అమెజాన్ ఫ్లాగ్‌షిప్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులకు ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు గురించి వివరిస్తూ అమెజాన్ 60 వేల కోట్ల పెట్టుబడిని లక్ష కోట్లకు పెంచాలని ఆహ్వానించారు. అమెజాన్ డేటా సెంటర్ ప్రాజెక్టు ఫ్యూచర్ సిటీలో యాంకర్ ఇన్వెస్ట్‌మెంట్‌గా నిలుస్తుందని, దీని ద్వారా ఫార్చ్యూన్-500 సంస్థలు కూడా ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆ సందర్భంగా పేర్కొన్నారు. అవసరమైన అన్నిరకాల ఏర్పాట్లను ప్రభుత్వం చూసుకుంటుందని భరోసానివ్వడంతో అమెజాన్ ప్రతినిధులు వెంటనే ఆ దిశగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కాగా, సెప్టెంబర్ 5న టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ బృందం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై ఫ్యూచర్ సిటీలో రూ.70 వేల కోట్లు పెట్టుబడితో 1 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డేటా సెంటర్ 2028 జూన్ 2 నాటికి, తెలంగాణ అవతరణ దినోత్సవానికి ప్రారంభించాలని సీఎం కోరారు. ఈ పెట్టుబడి టీసీఎస్ వైపు నుంచి ఇప్పటివరకు భారత్‌లో ప్రకటించిన అతిపెద్ద పెట్టుబడుల్లో ఒకటి కావడం గమనార్హం. తాజాగా ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ సంస్థ రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో సుమారు 170 ఎకరాల్లో హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్ పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రారంభ పెట్టుబడి రూ.60 వేల కోట్లు కాగా తర్వాతి దశల్లో మొత్తం పెట్టుబడి రూ.లక్ష కోట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. ఫ్యూచర్ సిటీలో కంట్రోల్ ఎస్ సంస్థకు సంబంచించిన భారీ 2 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్ ఇప్పటికే నిర్మాణానికి నోచుకుంది. యూపీసీ వోల్ట్ సంస్థకు సంబంచించిన 100 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనపై సైతం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఫ్యూచర్ సిటీలో జీసీసీలకు మార్గం సుగమం

హైదరాబాద్ ఇప్పటికే దేశంలో ప్రధాన జీసీసీ కేంద్రంగా దూసుకెళ్తున్నది. ఫ్యూచర్ సిటీలో డేటా సెంటర్ల ద్వారా భారీ కంప్యూట్ మౌలిక సదుపాయాలు ఏర్పడితే, కొత్త జీసీసీలు, ఏఐ యూనిట్లు ఇక్కడికి రావడం సహజ పరిణామంగా పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుతో భారత్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే ప్రపంచ స్థాయి టెక్ సంస్థలు ఫ్యూచర్ సిటీ వైపు మరింత దృష్టి సారించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, జీసీసీల కోసం ఒక ప్రత్యేకమైన జోన్ వంటి ప్రాంతాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా విడుదల చేసే భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌తో దీనిపై మరింత క్లారిటీ రానుంది.

## బొజ్జు బుచ్చమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మంచాల ఎల్లయ్య



**తెలుగు గళం న్యూస్ జాఫర్‌గడ్, సెప్టెంబర్ 18**

జాఫర్‌గడ్ మండలం వడ్డెగూడెం ఎస్సీ కాలనీకి చెందిన బొజ్జు భాస్కర్ తల్లి బొజ్జు బుచ్చమ్మ ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య శుక్రవారం ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బొజ్జు బుచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంచాల ఎల్లయ్య, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తనవంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ డైరెక్టర్ ఇల్లందల బాబు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికాయల రాజేందర్, గ్రామశాఖ అధ్యక్షుడు మంచాల అనిల్, వార్డు సభ్యులు తాటికాయల కిరణ్, ఇల్లందల ఎల్లస్వామి, నాయకులు నల్లబోయిన రాజు, అంజయ్య, మంచాల రాజు, గ్రామ పెద్దలు, కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలలుగా కళాకారుల కన్నీళ్లు..ప్రభుత్వ స్పందన ఎప్పుడు?

### వృద్ధ కళాకారుల పెన్షన్ వెంటనే పునరుద్ధరించాలి: సకల కళల జేఏసీ

**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, సెప్టెంబర్ 18**

తెలంగాణ సంస్కృతి, జానపద కళలను తమ జీవితాంతం కాపాడుతూ ప్రజలకు అందించిన వృద్ధ కళాకారుల పెన్షన్‌ను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని సకల కళల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ భూపతి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్‌కే హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాషా సాంస్కృతిక శాఖ ద్వారా రాష్ట్రంలో సుమారు 1,500 మంది వృద్ధ కళాకారులకు నెలకు రూ.3,016 చొప్పున అందుతున్న పెన్షన్ ఏప్రిల్ 2025 నుంచి నిలిచిపోయిందని భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. నిధులు, బడ్జెట్ సమస్యల కారణంగా పెన్షన్ చెల్లింపులు నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఒగ్గుకథ, బుర్రకథ, గంగిరెద్దు, చిందు యక్షగానం, బైండ్ల, బాలసంత తదితర జానపద కళారూపాలను కాపాడిన 60 నుంచి 80 ఏళ్ల వయస్సున్న వృద్ధ కళాకారులు ప్రస్తుతం కనీస అవసరాలు, మందుల ఖర్చులకు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ కళాకారుల పెన్షన్‌ను ఆసరా పథకంలో ఎనిమిదో రకంగా గుర్తించాలని, ఏప్రిల్ 2025 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల పెన్షన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న 1,500 మంది లబ్ధిదారుల సంఖ్యను పెంచి అర్హులైన 4,000 మందికి పైగా వృద్ధ కళాకారులకు పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. ఇకపై పెన్షన్ నిలిచిపోకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రతి నెలా డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ జానపద కళలను తరతరాలకు అందించిన కళాకారులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం




బాధాకరమని భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. ఇది కేవలం పెన్షన్ సమస్య కాదని, తెలంగాణ సంస్కృతిని కాపాడిన కళాకారుల గౌరవానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పెన్షన్ బకాయిలను విడుదల చేసి వృద్ధ కళాకారులకు శాశ్వత ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే త్వరలో రవీంద్రభారతిని ముట్టడిస్తామని భూపతి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సమావేశంలో సకల కళల జేఏసీ హైదరాబాద్ అధ్యక్షుడు ఇమ్మడి ఎల్లయ్య, కార్యదర్శి సాదుల జనార్ధన్ దేవరకొండ, సకల కళల జేఏసీ అధ్యక్షురాలు కొండ లలితాబాయి పాల్గొన్నారు.

## వక్ఫ్ భూములను గుర్తించి పరిరక్షించాలి

- సెక్షన్ 22/ఏ నిషేధిత జాబితా నుంచి ప్రైవేటు, రైతుల భూములను తొలగించాలి

**తెలుగు గళం న్యూస్ జనగామ సెప్టెంబర్ 18**



వక్ఫ్ భూములను సమగ్రంగా గుర్తించి పరిరక్షించడంతో పాటు, సెక్షన్ 22/ఏ నిషేధిత జాబితాలో పొరపాటున చేర్చబడిన ప్రైవేటు, రైతుల భూములను వెంటనే తొలగించాలని జనగామ జిల్లా బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహమ్మద్ సలీం, మహమ్మద్ యాకూబ్ పాషా, గులాం జానీ, అజ్జు తదితరులు జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని వక్ఫ్ భూములను అధికారులు సమగ్రంగా గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదే సమయంలో సెక్షన్ 22/ఏ నిషేధిత జాబితాలో పొరపాటున చేర్చబడిన రైతులు, ప్రైవేటు భూములను పరిశీలించి నిషేధిత జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లాలో వందల ఎకరాల వక్ఫ్ భూములు అక్రమ కబ్జాలకు గురైనట్లు వారు ఆరోపించారు. సంబంధిత రెవెన్యూ, వక్ఫ్ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి వక్ఫ్ భూముల వాస్తవ పరిస్థితిని గుర్తించాలని కోరారు. ఆక్రమణలకు గురైన భూములను గుర్తించి, అక్రమంగా కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని తిరిగి వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడం ద్వారా ముస్లిం మైనారిటీలకు సంబంధించిన ఆస్తి హక్కులు, ప్రయోజనాలను కాపాడాలని వారు పేర్కొన్నారు. సమస్యపై అధికారులు తగిన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ముస్లిం మైనారిటీలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఐక్యంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, గురుకులాల విద్యా విధానం ఆదర్శనీయం

### ధర్మసాగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సందర్శించిన టర్కీ ప్రతినిధుల బృందం

**తెలుగు గళం న్యూస్ ధర్మసాగర్, సెప్టెంబర్ 18**

తెలంగాణలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), గురుకులాల విద్యా విధానం ఆదర్శనీయమని టర్కీ దేశ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధుల బృందం ప్రశంసించింది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని టర్కీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు మసూద్ ఓనర్, నూరుల్లా, ఏఐఎఫ్టీవో అధ్యక్షుడు అశ్విని కుమార్, సెక్రెటరీ జనరల్ సి.ఎల్. రోజ్, గౌరవ ఎమ్మెల్సీ, ఏఐఎఫ్టీవో వర్కింగ్ ప్రెసిడెంట్ పింగిలి శ్రీపాల్ రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులు, బోధనా పద్ధతులు, విద్యా విధానాన్ని ప్రతినిధులు పరిశీలించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎం. మాధవి నుంచి పాఠశాలలో అమలు చేస్తున్న విధానాలు, విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అభినందనీయంగా ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, ఇతర సౌకర్యాలను కల్పిస్తూ కేజీబీవీలను రెసిడెన్షియల్ తరహాలో నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. గతంలో బడి మానేసిన విద్యార్థులు, విద్యకు దూరమైన బాలికలను తిరిగి విద్యావ్యవస్థలోకి తీసుకురావడమే కాకుండా, ప్రస్తుతం ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థినులకు విద్య అందించడం అభినందనీయమని తెలిపారు. కేజీబీవీల తరహా పాఠశాలలను టర్కీలోనూ ఏర్పాటు చేసేందుకు తెలంగాణలో అమలవుతున్న విద్యా విధానాలను పరిశీలించి, అనుసరించేందుకు ప్రయత్నిస్తామని మసూద్ ఓనర్, నూరుల్లా తెలిపారు. ఇప్పటివరకు సుమారు 40 దేశాలను సందర్శించి ఆయా దేశాల్లోని పాఠశాల విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠ్య ప్రణాళికలను పరిశీలించినట్లు వారు వెల్లడించారు. భారతదేశంలోని పలు పాఠశాలలను కూడా సందర్శించామని, తాము పరిశీలించిన ఉత్తమ విధానాలను తమ దేశంలోనూ అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. టర్కీ ప్రతినిధులకు ఉన్న సందేహాలను ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి నివృత్తి చేస్తూ తెలంగాణలో అమలవుతున్న విద్యా విధానాలు, కేజీబీవీల నిర్వహణ, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతినిధుల బృందం ముఖాముఖి నిర్వహించింది. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా విద్యాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, జీసీడీవో






సునీత, ధర్మసాగర్ మండల విద్యాధికారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులగం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షం గౌడ్, అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, ఏఐఎఫ్టీవో ప్రతినిధులు చిత్తలూరి ప్రసాద్, త్రివేణి, విజయలక్ష్మి, గీత, పాలిటెక్నిక్ అధ్యాపకురాలు రజితారెడ్డి, హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు ఫలీత శ్రీహరి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల ఉపేందర్ రెడ్డి, మహబూబాబాద్ అధ్యక్షుడు మిర్యాల సతీష్ రెడ్డి, ధర్మసాగర్ పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి అజ్మీర జానీ సింగ్, గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జఫర్ఘడ్ మండలంలో విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య




**తెలుగు గళం న్యూస్ జఫర్ఘడ్ సెప్టెంబర్ 18**

జఫర్‌గడ్ మండలంలోని విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు అంతరాయం లేకుండా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం మండల నాయకులు జఫర్‌గడ్ విద్యుత్ శాఖ ఏఈకి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రత్యేక విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని వారు కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నిలిపివేయాలని, రైతులకు సాగు సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిస్కౌంట్ పేరుతో తీసుకొస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయడంతో పాటు రైతులకు నష్టం కలిగించే విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. మండలంలోని గ్రామాల్లో కిందికి వేలాడుతున్న పాత విద్యుత్ లైన్లను తొలగించి వాటి స్థానంలో కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని, ఓవర్‌లోడ్‌తో ఇబ్బందులు ఎదురవుతున్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రైతులకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు ఎండి. శంషుద్దీన్, పులిగిల్ల నాగరాజు, వడ్లకొండ రాజు, కన్యబోయిన నాగయ్య, అన్నపు ప్రభాకర్, జల్లెల్ల శ్రీను, నక్క సారయ్య, కొంతం కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పీవీఎన్ కాలనీలో ఆధ్యాత్మిక శోభ”



**సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్ 18 (తెలుగుగళం) న్యూస్:** సత్తుపల్లి పట్టణంలోని సింగరేణి ఉద్యోగుల పీవీఎన్ సెంటినరీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని ఐఎన్‌టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా కాలనీ కుటుంబ సభ్యులంతా ఐక్యంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయని పేర్కొన్నారు. వినాయక విగ్రహ దాత దీపిక-భాస్కర్‌లాల్ దంపతులకు, కాలనీ కుటుంబ సభ్యులకు గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్లేష్, చంద్రశేఖర్, నాగప్రకాష్, నరసింహారావు, కంచ శ్రీనివాస్, రఘుపతి, బద్రు, భూక్య రమేష్, వీరరాజు, సందీప్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై,బెల్ట్,బూట్లు పంపిణీ చేసిన సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/సెప్టెంబర్18**



వరంగల్ జిల్లా:పర్వతగిరి. జమాల్ పురం-సోమారం అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ప్రభుత్వం తరపున విద్యార్థులకు టై, బెల్ట్, బూట్లను సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉందన్నారు. మెరుగైన ప్రతిభతో పోటీ పరీక్షలను ఎదుర్కొని ఉద్యోగాలు సాధించిన ఉన్నత విద్యావంతులే ప్రభుత్వ ఉపాధ్యాయులని, ఎలాంటి పోటీ లేకుండా, సరైన అర్హత లేకుండానే బోధన చేస్తున్నవారే ప్రైవేటు ఉపాధ్యాయులని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు విద్యపై దృష్టి కన్నా ప్రతినెలా రుసుములు వసూలు చేయడమే లక్ష్యంగా ఉంటుందని, దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దృష్టి చదువుపై కాకుండా రుసుములపైనే ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు మధ్యాహ్న భోజనం పెట్టి విద్యాబోధన చేస్తున్నారని, ఇప్పటివరకు రాష్ట్ర, దేశ స్థాయిలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో ఉన్నతంగా రాణించిన వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని ఆయన విద్యార్థులకు ఉపదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోనియమ్మ వల్లే తెలంగాణ వచ్చింది

### ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్య

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/సెప్టెంబర్ 18**



వరంగల్ జిల్లా:వర్ధన్నపేట క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య విలేకరుల సమావేశం మాట్లాడుతూ.. సబండ వర్గాల పోరాటం,సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయం వల్లే ప్రత్యేక తెలంగాణ వచ్చింది. ఉద్యమ సమయంలో తెరాస నాయకులు రెచ్చగొట్టే ప్రసంగాలతో 1200 మంది బిడ్డల చావులకు కారణమయ్యారు. వారి కుటుంబాలను పరామర్శించింది కాంగ్రెస్ నాయకులే. తెలంగాణ వచ్చాక కెసిఆర్ కుటుంబంతో ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీని తెలంగాణ తల్లి అని పొగడలేదా? దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి మాట తప్పింది కెసిఆరే. దళితుడిని ఉప ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించింది కూడా వారే. అందుకే భారాస దళిత వ్యతిరేక పార్టీ. దళితులకు మూడు ఎకరాలు ఇస్తానని చెప్పి మూడు ఇంచుల భూమి కూడా ఇవ్వలేదు. ధరణి పేరుతో,ల్యాండ్ పూలింగ్ పేరుతో వర్ధన్నపేట నియోజకవర్గంలో మాజీ శాసనసభ్యుడు దళితుల భూములు కబ్జా చేసిన భూ బకాసురుడు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, భూ దోపిడీకి పాల్పడింది భారాస నాయకులే. అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగపాణి,టౌన్ అధ్యక్షులు ఈగ దామోదర్, సర్పంచులు,నాయకులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట జడ్పీ హైస్కూల్‌లో యూనిఫాంల పంపిణీ




**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

జగ్గయ్యపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫాంలను పంపిణీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామ ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నడిపెల్లి శాంతాదేవి వెంకట్రావు,ఉపసర్పంచ్ ఒడ్డాల శ్రీకాంత్,వార్డు సభ్యుడు పేరాల రాజేందర్,పాలకవర్గ సభ్యులు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## లింగంపల్లి, కొండాపూర్ నుంచి సీపీఎంలోకి 8 కుటుంబాల చేరికలు

### ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం

**తెలుగు గళం న్యూస్ జనగామ/చిల్పూర్, సెప్టెంబర్ 18**



జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో లింగంపల్లి, కొండాపూర్ గ్రామాలకు చెందిన ఎనిమిది కుటుంబాల ప్రతినిధులు సీపీఎంలో చేరారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ పేదలు, రైతులు, కార్మికుల సమస్యలపై సీపీఎం నిర్వహిస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతున్నాయని వారు విమర్శించారు. ఉచిత పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టడం కంటే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడమే నిజమైన సంక్షేమమని పేర్కొన్నారు. పేద, బడుగు వర్గాల హక్కుల సాధన కోసం సీపీఎంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారు-అపరాధపు రవి కుమార్, నాగవెల్లి సాయి, బానోత్ రాజేందర్, పెండ్లి రాజు, కర్రె సంపత్, కండ్లకోల ప్రవీణ్ కుమార్ (లింగంపల్లి)గుండబోయిన సదానంద, గుండబోయిన రాజు (కొండాపూర్). ఈ కార్యక్రమంలో సీపీఎం చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక విలువలకు ప్రోత్సాహం

### శ్రీ కన్నెమూల విద్యా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ పామిడి ఆధ్వర్యంలో 40 భగవద్గీత పుస్తకాల పంపిణీ

**తెలుగు గళం న్యూస్ పామిడి**





అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలం పామిడి పట్టణంలో శ్రీ కన్నెమూల విద్యా వినాయక ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు 40 భగవద్గీత పుస్తకాలను వితరణ చేయడం జరిగింది ఈ భగవద్గీత పుస్తకాలను జోగి పురుషోత్తం సహకారంతో మొత్తం 40 భగవద్గీత పుస్తకాలను గ్రూపు సభ్యులకు వితరణ చేశారు. భగవద్గీత ప్రాముఖ్యత, మానవ జీవితంలో దాని ఆవశ్యకత గురించి సభ్యులు వివరించారు. భగవద్గీతలోని బోధనలు నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడానికి కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వహించడానికి మంచి ఆలోచనలు మరియు సత్ప్రవర్తనను అలవర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. యువతతో పాటు ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదివి అందులోని సందేశాలను తమ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక, ధార్మిక విలువలను పెంపొందించడమే ఇలాంటి కార్యక్రమాల ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. భగవద్గీత పుస్తకాల వితరణకు సహకరించిన దాత జోగి పురుషోత్తంకు శ్రీ కన్నెమూల విద్యా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే కుట్రలను తిప్పికొట్టాలి"




సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్ 18 (తెలుగుగళం)న్యూస్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు పిలుపునిచ్చారు. సత్తుపల్లి పట్టణ సీపీఐ(ఎం) కమిటీ ఆధ్వర్యంలో పాత సెంటర్‌లో నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన పోరాటంలో యోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయడం బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో: పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, రైతు సంఘం నాయకులు శ్రీహరి, సైదా, కోటయ్య, బలగాని శ్రీను, చప్పిడి భాస్కర్, నల్లగట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదరణను తట్టుకోలేకే గండ్రపై నిరాధార ఆరోపణలు

## బీఆర్ఎస్ నాయకుడు బానోతు వినోద్ కుమార్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డికి నియోజకవర్గంలో లభిస్తున్న విశేష ప్రజాదరణను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనపై అసత్య, నిరాధార ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ నాయకుడు బానోతు వినోద్ కుమార్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల వేళ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేస్తోందని, ఆ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ప్రజల తరఫున నిలబడుతున్నందుకే గండ్రపై కక్షగట్టి దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తాను ఏం మాట్లాడినా ప్రజలు నమ్ముతారనే భ్రమతో బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని, తెలంగాణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరిగిందని, కాంగ్రెస్ పాలనా తీరును ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు. భూపాలపల్లిలో గజం రూ.50 వేల విలువైన ప్రాంతంలో గండ్రకు గత ప్రభుత్వం 106 ఎకరాలు ధారాదత్తం చేసిందంటూ చేస్తున్న అసత్య ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. అసలు భూపాలపల్లిలో అంతటి భారీ విలువ పలికే ప్రాంతం ఎక్కడుందో పాలకులు ఆధారాలతో సహా నిరూపించాలని డిమాండ్ చేశారు. ఆ 106 ఎకరాల్లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరిట పార్కును ఏర్పాటు చేసి ప్రజా ప్రయోజనాల కోసమే అభివృద్ధి చేశారని స్పష్టం చేశారు. ఈ అంశంపై మాజీ



ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విసిరిన సవాల్‌ను ప్రభుత్వం స్వీకరించి, వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో గండ్ర వెంకట రమణారెడ్డి భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, ఎన్ని కక్షపూరిత ఆరోపణలు చేసినా ఆ ప్రగతిని ఎవరూ చెరిపివేయలేరని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని, రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు గండ్ర వెంకట రమణారెడ్డి వెంటే నిలబడి, భూపాలపల్లిలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు

# వెంకటేశ్వరపల్లిలో రోడ్డు విస్తరణకు అధికారుల పరిశీలన

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి



మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల సాధ్యాసాధ్యాలపై ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.గ్రామంలో రాకపోకలు పెరిగి రోడ్డు ఇరుకుగా మారడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వరంగల్ ఆర్‌డీ ఎస్ఈ ఫణికుమారి,ఈఈ ప్రవీణ్,డీఈ,ఏఈలు గ్రామాన్ని సందర్శించారు.అందుబాటులో ఉన్న స్థలం,విస్తరణకు తీసుకోవాల్సిన ఇంజినీరింగ్ చర్యలపై ఆరా తీశారు.రోడ్డు వెడల్పుతో రాకపోకలు సులభతరమవుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సర్పంచ్ కాడవేనా సరిత యుగేందర్,ఉపసర్పంచ్ పొన్నం రాజు,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయిని కుమారస్వామి,మాజీ సర్పంచ్ రజిత రాజు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిగురుమామిడి కుమారస్వామి,స్థానికులు పాల్గొన్నారు.

# ఆరోగ్య, ఇంజనీరింగ్ శాఖలపై ఐటీడీఏ పీఓ సమీక్ష

## ఆరోగ్య సేవలు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అధికారులు బాధ్యతగా పనిచేయాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

**ఆసుపత్రుల్లో లోపాలు పునరావృతమైతే కఠిన చర్యలు**

**గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు**

**అసంపూర్తి భవన పనులను గడువులోగా పూర్తి చేయాలి**

**ప్రభుత్వ ఆస్తులు నిరుపయోగంగా మారకుండా వినియోగంలోకి తేవాలి**





తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 18:

ఐటీడీఏ పరిధిలోని ఆరోగ్య, ఇంజనీరింగ్ శాఖల పనితీరు, మౌలిక వసతులు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఆసుపత్రుల నిర్వహణ, మాతా-శిశు ఆరోగ్య సేవలు, ఆరోగ్య శిబిరాలు, గిరిజన గ్రామాలు, విద్యా సంస్థల్లో వైద్య సేవలపై సమీక్షించారు. ఆసుపత్రుల్లో సిబ్బంది హాజరు వివరాలను సక్రమంగా నిర్వహించాలని, లోపాలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని పీఓ హెచ్చరించారు. వ్యాక్సిన్ల లభ్యత, నిల్వ, గడువు తేదీలు, రిఫ్రిజిరేటర్ల నిర్వహణను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. ప్రసూతి సేవలకు అవసరమైన పడకలు, మరుగుదొడ్లు, తాగునీరు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలోని భవన నిర్మాణ పనుల పురోగతిని ప్రాంతాల వారీగా సమీక్షించారు. మొత్తం 46 భవన నిర్మాణ పనులకు మంజూరు లభించగా, 42 భవనాలు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మరికొన్ని భవనాలు అప్పగింతకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పుట్టిన శిశువుల కోసం వేచి ఉండే కేంద్రాలకు సంబంధించిన ఐదు పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. పాక్షికంగా పూర్తయిన భవన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పీఓ లెనిన్ వత్సల్ సూచించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులు నిరుపయోగంగా మారకుండా పెండింగ్ పనుల వివరాలను స్పష్టంగా సమర్పించి, అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్ట్ అధికారి టీవీఆర్ దామోదర స్వామి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. క్రాంతి కుమార్, కార్యనిర్వహణ ఇంజనీర్ ప్రవీణ్, ఐటీడీఏ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# బాలయ్యపల్లెలో భూ సమస్యలపై గ్రామసభ

## రీ-సర్వేతో పరిష్కరిస్తామన్న అధికారులు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి



బాలయ్యపల్లె గ్రామంలో శుక్రవారం భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు భూ రికార్డుల్లోని లోపాలు,సరిహద్దు వివాదాలను ఆర్డీఓ, తహసీల్దార్, జీపీఓల దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవసరమైన చోట్ల రీ-సర్వే నిర్వహించి త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.భూ సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపడం పట్ల సర్పంచ్ తొట్ల తిరుపతి,గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ,రీ-సర్వేను వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పిండి ప్రభాకర్,వార్డు సభ్యులు,రెవెన్యూ అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ పోలీస్ ఉద్యోగాల్లో గిరిజనులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

**గిరిజన యువతకు ఉద్యోగ భరోసా కల్పించాలి..**

**75 శాతం రిజర్వేషన్ పునరుద్ధరించాలి**

**ఏజెన్సీ హక్కులను కాపాడాలి..**

**పోలీస్ నియామకాల్లో గిరిజనులకు న్యాయం చేయాలి**

**సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు**



తెలుగు గళం హైదరాబాద్, సెప్టెంబర్ 18:

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానిక ఆదివాసీ, గిరిజన నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, వెద్మ బొజ్జు, రాందాస్ నాయక్‌లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ అందజేశారు. ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ నియామక ప్రకటనలో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడం వల్ల స్థానిక ఆదివాసీ, గిరిజన నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టం జరుగుతోందని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రత్యేక పరిస్థితులు, స్థానిక గిరిజన యువతకు పరిమితంగా ఉన్న ఉపాధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక రిజర్వేషన్‌ను అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీస్ ఉద్యోగాలు స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించడంతో పాటు, ఆయా ప్రాంతాల్లోనే స్థానిక యువత పోలీస్ శాఖలో సేవలందించే అవకాశం కల్పిస్తాయని తెలిపారు. గతంలో అమల్లో ఉన్న ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలోనే 75 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. పోలీస్ సివిల్ కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 109, తేదీ 17-06-1988, అలాగే గెజిట్ ప్రకటన సంఖ్య 49, తేదీ 10-05-2018లో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక రిజర్వేషన్ నిబంధనలు ఉన్న విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. ఇప్పటికే శాసనసభలోనూ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. పినపాక నియోజకవర్గంతో పాటు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం తదితర ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన నిరుద్యోగ యువతకు సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రస్తుత పోలీస్ నియామక ప్రక్రియలోనే 75 శాతం రిజర్వేషన్ అమలు చేసి ఏజెన్సీ ప్రాంతాల గిరిజన యువతకు న్యాయం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, వెద్మ బొజ్జు, రాందాస్ నాయక్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

# మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత

స్టేషన్ ఘనపూర్, తెలుగుగళం, సెప్టెంబర్ 18:



స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ 14వ వార్డులో గరిగే లక్ష్మీనరసింహా అకాలంగా మరణించారు. 14వ వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.లక్ష్మీనరసింహా కుమారులు గరిగే యాదగిరి వెంకటస్వామి లకు వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య 50 కిలోల బియ్యం ఇవ్వడం జరిగింది.వీరితో పాటు రాజారపు ఏలియా, ఎండి సలీం, కొంగరి రమేష్, అక్కపెల్లి శీను, బాలు, ప్రశాంత్,నర్మెట అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్రీడా సందడి

## క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్

సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్18(తెలుగు గళం) న్యూస్:

సింగరేణిలో వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం, సత్తుపల్లి ఏరియాల సంయుక్తంగా ఫుట్ బాల్ , లాంగ్ టెన్నిస్ , స్విమ్మింగ్ నిర్వహించారు. పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసిన ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్. వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శరీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయని క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు సానుకూల ఆలోచన విధానం పెంపొందుతుందని తెలిపారు.క్రీడలు వ్యక్తిగత జీవితంలో ఉత్సాహాన్ని , క్రమశిక్షణను పెంచడంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తాయని అన్నారు. గెలుపు , ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు సూచించారు. ఎలాంటి గాయాలు,ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు పాటిస్తూ పోటీల్లో పాల్గొనాలని కోరారు. ప్రాంతీయ, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి కొత్తగూడెం, సత్తుపల్లి ఏరియాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైపీఎం జి.హరీష్, ఏఐటీయూసీ నాయకులు గట్టయ్య, సముద్రాల సుధాకర్ ఐఎన్టీయూసీ నాయకులు ఎం.డి. రజాక్, తీగల క్రాంతి కుమార్ , స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సందబోయిన శ్రీనివాస్, జనరల్ కెప్టెన్ రాజశేఖర్, యూనియన్ ప్రతినిధులు, వివిధ క్రీడల కెప్టెన్లు, క్రీడాకారులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.




# వినాయక మండపాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర"

సత్తుపల్లి,ఆర్ సి, సెప్టెంబర్ 18, (తెలుగు గళం)న్యూస్:



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు లలితకుమారి రోడ్, 3వ వార్డు అవని వెంచర్, 5వ వార్డు కేసీఆర్ డబుల్ బెడ్రూమ్, 20వ వార్డు బైపాస్ రోడ్, 22వ వార్డు నేతాజీ రోడ్‌లలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మండపాల వద్దకు విచ్చేసిన సండ్ర వెంకట వీరయ్యకు ఉత్సవ కమిటీ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు తో కలిగి ఉండాలని సండ్ర ఆకాంక్షించారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన మేకల సుహాని"

## మాజీ ఎమ్మెల్యే సండ్ర అభినందనలు"



సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్ 18, (తెలుగుగళం) న్యూస్:

సత్తుపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మేకల శ్రీనివాసరావు కుమార్తె మేకల సుహాని ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆమెను అభినందించారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సుహానిని అభినందించిన ఆయన, వైద్య విద్యలో ఉన్నత స్థాయికి ఎదిగి, భవిష్యత్తులో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. తన ప్రతిభతో ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని పేర్కొంటూ, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సండ్ర వెంకట వీరయ్య ఆశీర్వదించారు.

# పిట్లంలో 'కాగితం పడవలు' మూవీ విడుదల వేడుక

తెలుగు గళం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం:




కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రానికి చెందిన 'కాగితం పడవలు' చిత్ర దర్శకుడు ఎంజీఆర్ తుకారాం ఆధ్వర్యంలో సినిమా విడుదల వేడుకను ఘనంగా నిర్వహించారు. పిట్లం వెంకటేశ్వర థియేటర్‌లో కేక్ కట్ చేసి చిత్ర విడుదలను వారి తండ్రి తో అభిమానులతో పాటు కలిసి పండగ వాతావరణంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా తుకారాం అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన అభిమానులతో థియేటర్ పరిసరాలు కోలాహలంగా మారాయి. తండ్రితో కలిసి వచ్చిన తుకారాం అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అభిమానులు, గ్రామ ప్రజలతో కలిసి థియేటర్‌లో 'కాగితం పడవలు' చిత్రాన్ని వీక్షించారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.